ప్రజాశక్తి

బుధవారం 13 ఆగస్టు 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి



మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై చర్చిస్తున్న ఆర్‌టిసి అధికారులు

తర్జనభర్జన

- ఉన్న బస్సుల్లోనే 'ఉచితం'
- కొత్త వాటిపై అదే ప్రతిష్టంభన
- స్త్రీ శక్తి పథకం కోసం

విశాఖలో 570 బస్సుల కేటాయింపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణాలకు ఇంకా మూడు రోజుల వ్యవధే ఉంది. ఆ ఏర్పాట్లలో జిల్లా ఆర్‌టిసి అధికారులు నిమగ్నమయ్యారు. ఉచిత ప్రయాణ పథకంతో మహిళల ప్రయాణాలు పెరుగుతాయనే అంచనా ఉన్నా అందుకు తగిన బస్సు సర్వీసులు విశాఖ మహానగరంలో లేవనే చెప్పాలి. గడచిన ఏడాది కాలంలో కొత్త బస్సులేవీ జిల్లాకు రాలేదు. 100 బస్సులకుపైగా ఇక్కడకు రాబోతున్నాయన్నమాటనే చెబుతూ అధికారులు ఊరిస్తున్నారు. అప్పటి వరకూ బస్సులను ఎలా సర్దుబాటు చేయాలి ? స్త్రీల ఉచిత ప్రయాణాల నేపథ్యంలో ఏయే మార్గాలను అవలంబించాలి ? అన్న విషయాలపై తాజాగా వారంతా తర్జనభర్జనలు పడుతున్నారు. బస్సు ఫిట్‌నెస్‌లు, ఆదాయ మార్గాలు, నష్టాలపై చర్చలు జరుపుతున్నారు.

విశాఖలోని ఏడు డిపోల పరిధిలో 730 బస్సులుండగా వీటిలో 686 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. జిల్లాలో సుమారు 11.3 లక్షలకుపైగా మహిళా జనాభా ఉన్నట్టు అంచనా. వీరిలో ప్రయాణాలకు సంబంధించి ఎంత మంది సిద్ధం అవుతారన్న అంశాలపైనా ఆర్‌టిసి అధికారులు లెక్కలు వేస్తున్నారు. ఏటా విశాఖ జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో 680 సర్వీసుల నుంచి రూ.340 కోట్ల ఆదాయం వస్తోంది. ప్రభుత్వ 'ఉచిత' ప్రయాణ నిర్ణయంతో దీనిపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వారిలో ఉంది.

ఫిట్‌నెస్ బస్సులపై ఆర్‌టిసి లెక్కలేమిటి?

ప్రస్తుతం రోడ్డెక్కుతున్న బస్సుల్లో ఎక్కడా ఫిట్‌నెస్ సమస్యలు లేవని, 15 ఏళ్ల తర్వాత వాటిని స్వతహాగా నిలిపేయడం జరుగుతోందని ద్వారకా బస్‌స్టేషన్ అధికారులు లెక్కలు తేల్చారు. 15 ఏళ్లలోపు బస్సులకు ఫిట్‌నెస్ ఉంటుందని చెబుతున్నారు. స్త్రీ శక్తి పథకం కోసం 570 బస్సులను ఏకంగా విశాఖ ఆర్‌టిసి కేటాయించింది. ఈ పథకం ద్వారా ఆక్యుపెన్సీ రేషియో (ఒఆర్) 100 నుంచి 120 శాతం వరకూ ఉంటుందన్నది ప్రాథమిక అంచనా. అంతేగాక బస్సుల్లో సీటింగ్ కెపాసిటీ ప్రస్తుతం 55 సీట్లుగా ఉండగా ఫ్రీ బస్సు విధానంతో మరో 30 మంది ఒక బస్సుకు అదనంగా నిండే అవకాశముందని తెలుస్తోంది. దీంతో బస్సుల్లో తోపులాట, ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పెనుగులాటలు తప్పవన్నది స్పష్టమవుతోంది.

కండక్టర్లు, డ్రైవర్లపై ఒత్తిడి

ప్రయాణికులను నియంత్రించే విషయమై కండక్టర్లు, డ్రైవర్లపై విపరీతమైన ఒత్తిడి పడనుంది. ఇప్పటికే చాలా బస్సుల్లో కండక్టర్లను తీసేసి డిపోల్లో 'ఆన్‌కాల్' డ్యూటీపై నియామకాలు చేసుకునే వీలును 'కూటమి' ప్రభుత్వం ఇచ్చింది. ఇలా చేరిన వీరంతా ప్రైవేట్ వారు కావడంతో బాధ్యతగా ఉంటారా ? సరైన రీతిలో ప్రయాణికులతో వ్యవహరిస్తారా ? అన్నది ప్రశ్నార్ధకమే. మరోవైపు గీతం వంటి ప్రైవేట్ సంస్థలకు 50కి పైగా మిగతా 2లో..

విశాఖ కేంద్రంగానే సృష్టి అక్రమాలు

తెలంగాణ పోలీసుల విచారణలో వెల్లడి

కెజిహెచ్ వైద్యుల అరెస్టుపై స్పష్టత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మంగళవారం కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొత్త పరిణామాలు సంతరించుకున్నాయి. ఈ కేసును సిట్‌కు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం హైదరాబాద్‌లో కన్సల్టెన్సీ మాత్రమే జరగగా విశాఖ కేంద్రంగానే ఈ వ్యవహారం అంతా నడిచిందని కేసును విచారణ చేస్తున్న తెలంగాణ అధికారి, హైదరాబాద్ నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటి వరకూ 25 మంది నిందితులను అరెస్టు చేశారు. ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఓ కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన బిడ్డను చూపించగా, మరో కేసులో రూ.15 లక్షలు ఎక్కువగా ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు అధికారుల విచారణలో తేలింది. ఈ కేసు వ్యవహారంలో కెజిహెచ్‌కి సంబంధించిన ఇద్దరు వైద్యులు డాక్టర్ వాసుపల్లి రవి, ఉషాదేవిలను అరెస్టు చేశామని తెలంగాణ పోలీస్ అధికారులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి అధికారికంగా ప్రకటించారు. త్వరలోనే విశాఖకు చెందిన ఇద్దరు పీడియాట్రిషన్లు, ఒక గైనకాలజిస్ట్‌తో పాటు నలుగురు దళారులను అరెస్టు చేయనున్నట్టు వారు తెలిపారు. విశాఖపట్నంలో సరోగసీ పేరుతో మోసం చేశారని ప్రకటించారు. బాధితులకు ఇచ్చిన బేబీ గర్ల్‌కి డిఎన్ఎ టెస్ట్ చేసి సరి పోల్చినప్పుడు ఈ వ్యవహారం బయట పడిందని వెల్లడించారు. ఈ కేసులో చాలా మంది డాక్టర్ల ప్రమేయం ఉందని తెలిపారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



విశాఖ బీచ్ రోడ్డులో మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా సాగింది, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, భద్రతా అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ సమానత్వంతోనే సమాజాభివృద్ధి

వార్త 2లో..

అదాని స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

వార్త 5లో..

ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

వార్త 7లో..

లూలూ మాల్ వద్దు

- సైన్స్ సిటీ నిర్మించండి
- పౌర, ప్రజా సంఘాల సమావేశంలో ప్రముఖ సామాజిక వేత్త రాణి శర్మ



మాట్లాడుతున్న రాణిశర్మ, చిత్రంలో పలు సంఘాల నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఆర్‌కె.బీచ్‌లో చట్టవిరుద్ధంగా 13.78 ఎకరాల భూమిని విదేశీ సంస్థ లూలూకు మాల్ కోసం అప్పగించడం తగదని, తక్షణం ఆ భూ కేటాయింపులను రద్దు చేయాలని ప్రముఖ సామాజిక వేత్త రాణి శర్మ అన్నారు. ఆ స్థలంలో సైన్స్ సిటీని నిర్మించాలని కోరారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రజా సంఘాల, పౌర సంస్థల సమావేశం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ స్వలాభం కోసం బీచ్ మొత్తాన్ని వ్యాపారంతో డంపింగ్ యార్డ్‌గా మార్చొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. విశాఖ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండి తీర ప్రాంతాన్ని రక్షించుకోవాలన్నారు. ఆర్‌కె.బీచ్‌లో ఉన్న 13.78 ఎకరాల భూమి మార్కెట్ విలువ రూ.3 వేల కోట్లకుపైగా ఉందని, దీనిని ఉచితంగా 99 ఏళ్ల లీజుకు చంద్రబాబు ప్రభుత్వం ధారాదత్తం చేయడం దారుణమని పేర్కొన్నారు. ఏడాదికి లీజు అద్దె భూమి యొక్క ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలో కేవలం ఒక శాతం మాత్రమేనన్నారు. నిర్మాణాలు పూర్తయ్యేదాక లీజు చెల్లించాల్సిన అవసరం లేదని జిఒ ఇచ్చారన్నారు. పదేళ్ళకొకసారి లీజు 10 శాతం మాత్రమే పెంచుతారని తెలిపారు. రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీకి చెల్లించాల్సిన రూ.50 కోట్లు రద్దు చేయటం, భూవినియోగ మార్పిడికి చెల్లించాల్సిన నాలా ఛార్జీలు రూ.40 కోట్లు మినహాయించటం, జివిఎంసికి చెల్లించాల్సిన సర్ ఛార్జీ రూ.5 కోట్లు రద్దు చేయడం, ఇవి చాలవన్నట్లు పదేళ్లపాటు జిఎస్‌టి మినహాయింపు ఇవ్వడం దారుణమన్నారు. దీనివల్ల ఏడాదికి కనీసం రూ.50 కోట్లను ప్రభుత్వం నష్టపోతుందన్నారు. ఐదేళ్లపాటు విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరంలేదని, ఆస్తి పన్ను కట్టక్కర్లేదని తెలిపారు. ఉచితంగా మంచినీటిని ప్రభుత్వమే ఇవ్వనుందన్నారు. లూలూ మాల్‌లో పనిచేసే ఉద్యోగులకు పిఎఫ్, ఇఎస్ఐ కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని జిఒలో ఉందన్నారు. ఇలా ఆయాచిత లబ్ధిని లూలూకు ప్రభుత్వం కల్పించడం వెనుక పెద్ద కుట్రనే దాగి ఉందన్నారు. కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సిఆర్‌జెడ్ నిబంధనలను తుంగలో తొక్కడం సరికాదన్నారు. టూరిజం పేర ఆర్‌కె బీచ్ నుండి భోగాపురం వరకు సముద్రతీర ప్రాంత భూములను, కొండలను రిసార్ట్స్, స్టార్ హోటల్స్, రెస్టారెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, స్మార్ట్ సిటీలు, విలాస భవనాలు, గోల్ఫ్ కోర్టులు, హార్స్ రైడింగ్, రకరకాల క్లబ్‌లు, ఇలా అనేక పేర్లతో సొంత ఆస్తులుగా మార్చుకుంటున్నారని తెలిపారు.

సైన్స్ సిటీ నిర్మించాలని తీర్మానం

లూలూకు భూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తర్జనభర్జన

బస్సులను ప్రభుత్వం కేటాయింపులు చేసింది. వీటని వెనక్కి రప్పిస్తుందా ? అంటే అధికారుల వద్ద సరైన సమాధానం రావడం లేదు. ఎప్పటి నుంచో ఈ పద్ధతి అమల్లో ఉందంటూ దాటవేస్తున్నారు.

బస్సులపై ప్రభుత్వ స్పష్టత

తొలుత రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా, ఏ బస్సులోనైనా మహిళలు ప్రయాణం చేసేలా కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల సందర్భంగా హామీనిచ్చిన సంగతి తెలిసిందే. తాజా మార్గదర్శకాల ప్రకారం పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణాలకు అవకాశం ఉంటుంది. బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు బస్సుల్లో తగిన గుర్తింపు కార్డు చూపించి ఉచిత ప్రయాణాలు చేయొచ్చు. అదే సందర్భంలో తిరుమల–తిరుపతి మధ్య తిరిగే సప్తగిరి బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించదు. మొత్తానికి ఉన్న బస్సుల్లోనే ఉచితం వర్తించనుంది.

లూలూ మాల్ వద్దు

కేటాయింపులను రద్దు చేసి, ఆ 13.78 ఎకరాల స్థలంలో సైన్స్ సిటీని లేదా సైన్స్ పార్క్‌ను నిర్మించాలని ఈ సమావేశం తీర్మానించింది. అంతరిక్ష పరిజ్ఞానం, ఖగోళ విజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్, ఆధునిక టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక దృశ్యాలను ప్రజలు తెలుసుకోవటానికి అద్భుతమైన సైన్స్ సిటీని నిర్మించాలని కోరింది. విశాఖ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పౌర వేదిక ఏర్పాటైంది. రాణి శర్మను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సమన్వయంతో సాగిన ఈ సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, హెచ్ఆర్ఎఫ్ నాయకురాలు అనురాధ, విరసం జిల్లా కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి వనజాక్షి, వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, న్యాయవాదులు పాకా సత్యనారాయణ, ఎన్.వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటం ఆగదు



నిమ్మరసమిచ్చి దీక్షలను విరమింపజేస్తున్న గంగారావు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖ డెయిరీలో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు 305 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఈ పోరాటం ఆగదని, మరింత ఉధృతం చేస్తామని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ హెచ్చరించారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మంగళవారం ఉదయం 10 గంటల వరకు 24 గంటల పాటు డెయిరీ కార్మికులు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష చేశారు. ఈ దీక్షతో పోరాటం అయిపోయినట్టు కాదని, ఇప్పుడే పోరాటం ప్రారంభమైందని అన్నారు. అదే విధంగా కార్మికులు వేసిన ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వారిని పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆనందకుమార్ ఎటువంటి నోటీసూ ఇవ్వకుండా చట్ట వ్యతిరేకంగా తొలగించడం దుర్మార్గమన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ పోరాటంతో డెయిరీ యాజమాన్యం మెడలు వంచాలన్నారు. అనంతరం కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. మంగళవారం విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ కార్మికుల దీక్షకు పలు సంఘాల నేతలు మద్దతు తెలుపుతూ ప్రసంగించారు. విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.రాంబాబు పాల్గొన్నారు.

స్త్రీ సమానత్వంతోనే సమాజాభివృద్ధి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి



మాట్లాడుతున్న ప్రభావతి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : స్త్రీ సమానత్వంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. సంఘం విశాఖ జిల్లా 17వ మహాసభ సవేరా ఫంక్షన్ హాల్‌లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నేడు అనేక రంగాల్లో మహిళలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నారన్నారు. వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు సకల రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. సరైన అవకాశాలు ఇస్తే వారు మరింత అభివృద్ధి సాధిస్తారన్నారు. నేటికీ చట్టసభల్లో సముచిత స్థానం లేదని తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకొచ్చి స్త్రీలకు స్వేచ్ఛ ఉండకూడదని చెబుతోందన్నారు. రానున్న కాలంలో మహిళా ఉద్యమాలకు మరింత పదును పెట్టాలని పిలుపునిచ్చారు.

మహాసభలో ఆమోదించిన తీర్మానాలివే..

బాలికలు, మహిళలకు రక్షణ కల్పించాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల కోసం రూ.30 వేలు చొప్పున కట్టిన వారందరికీ వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని, మద్యం, మాదకద్రవ్యాలను పూర్తిగా నియంత్రించాలని, మైక్రో ఫైనాన్స్ సమస్యలను పరిష్కరించాలని, ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వ నిఘా ఉండాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహాసభలో తీర్మానాలను ఆమోదించారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి





మహాసభలో 27 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్ఎన్.మాధవి, కార్యదర్శిగా వై.సత్యవతి ఎన్నికయ్యారు. బి.పద్మ, డి.కొండమ్మ, ఆర్.వరలక్ష్మి, సిహెచ్.సుమిత్ర, ఆర్.విమల, జి.లక్ష్మి, ఎస్.విజయలక్ష్మి, బి.భారతి, కె.కుమారి, కె.మణి, కె.అనురాధ, ఒ.విజయ, బి.మమత, వై.కల్యాణి, ఎల్.కామేశ్వరి, శ్రీదేవి, కె.వెంకటలక్ష్మి, వి.ప్రభావతి, డి.శైలజ, సుశీల నూతన కమిటీలో ఉన్నారు.

భావ ప్రకటనా స్వేచ్ఛపై నేడు చర్చ

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : కాశ్మీరులో ఇటీవల గవర్నర్ 25 పుస్తకాలను నిషేధించడంపై అన్ని సాహిత్య సంఘాలు బుధవారం ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సమావేశం అవుతున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఫ్రాన్సిస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భావ ప్రకటన స్వేచ్ఛపై చర్చ జరుగనుందని, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, పూర్వ యుపిఎస్‌సి సభ్యులు ఆచార్య కెవి.చలం, నాగార్జున యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.బాల మోహన్ దాస్, విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు అడపా రామకృష్ణ, సహృదయ సాహితీ అధ్యక్షులు శేఖర్ మంత్రి ప్రభాకర్, విశాఖ సార్వత్రిక వేదిక కార్యదర్శి డాక్టర్ డివి.సూర్యారావు, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ప్రముఖ రచయిత మేడా మస్తాన్ రెడ్డి, ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, అమరావతి విశ్వసాహితీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన సూర్యనారాయణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తాగు నీటి సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ బమ్మి అయ్యప్పనాయుడు, తాగు నీటి సరఫరా విభాగం సహాయక ఇంజినీరు జి.సురేష్‌ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. విశాఖ ఎంవిపి.కాలనీలో ఉన్న ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం తాగు నీటి సమస్యపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య ఏర్పడడానికి గల కారణాలను అధికారులనడిగి తెలుసుకున్నారు. వాటర్ వర్క్స్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్ల కొరత ఉన్నందున పూర్తి స్థాయిలో సేవలు అందించలేక పోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇంజినీర్ల కొరత లేకుండా చూడాలని సమావేశంలో పాల్గొన్న చీఫ్ ఇంజనీర్ పల్లంరాజుకు సూచించారు. పద్మనాభం మండలం సామయ్యవలస దగ్గర చెక్ డ్యాం నిర్మాణంతో గోస్తనీ ద్వారా నీటి లభ్యత పెరుగుతుందని, రెండు, మూడు నెలల్లో డ్యాం నిర్మాణ పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు. వాటర్ వర్క్స్ విభాగంలో మృతి చెందిన ఉద్యోగుల స్థానంలో పునర్నియామకం చేపట్టాల్సి ఉందని జివిఎంసి రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి వివరించారు. పట్టణీకరణ ప్రభావంతో అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు పెరుగుతున్నాయని, 150 అడుగుల లోతున బోర్లు తవ్వినా సరే నీరు లభించడం లేదని కొందరు కార్పొరేటర్లు సమావేశంలో ప్రస్తావించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

గంటాపై 2009 ఎన్నికల కేసు కొట్టివేత

ప్రజాశక్తి-మధురవాడ : ఎన్నికల సమయంలో అనకాపల్లి టౌన్ పోలీసులు గంటా శ్రీనివాసరావుపై నమోదు చేసిన అభియోగాలు రుజువు కాకపోవడంతో ఆ కేసును కొట్టి వేస్తూ విజయవాడలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున గంటా శ్రీనివాసరావు పోటీ చేసిన విషయం విదితమే. ఓటర్లకు 27 క్రికెట్ కిట్లు, 3 చీరలను, పార్టీ ప్రచార సామగ్రిని పంచుతున్నారని అనకాపల్లి టౌన్ పోలీసులు సీజ్ చేసి, గంటా శ్రీనివాసరావుపై క్రైమ్ నెంబర్. 133/ 2009 యుఎస్ 171 (ఇ) ఆర్/డబ్ల్యు ఐపిసి 511 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పూర్తి విచారణ జరిపిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు స్పెషల్ జడ్జి ఈ కేసు కొట్టి వేస్తూ తీర్పును ఇచ్చారని సీనియర్ న్యాయవాది ఉగ్గిన సూర్యనారాయణ తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కళాశాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ నెల 18వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో జిసిజిటిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు బి.సహదేవుడు, బి.ప్రసాదరావు, వై.వెంకటరావు, డి.మాధురి పాల్గొన్నారు



కొవ్వాడలో నిర్వహిస్తున్న గ్రామసభ

కొవ్వాడలో గ్రామసభ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కొవ్వాడ గ్రామంలో భూ సేకరణపై తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యాన మంగళవారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారి సంగీత్ మాధుర్ పాల్గొని రైతులతో మాట్లాడారు. గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 237లో 350 ఎకరాల భూమిలో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన రైతులు చెప్పిన సమస్యలపై అవగాహనా కలిపించి హక్కుదారులను గుర్తించి బుధవారం నుండి సర్వే చేపడతామని తెలిపారు. దీనిపై రైతులు స్పందించి అధికారులు ఇచ్చిన హామీలకు అంగీకరించారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నాలుగు రోజుల పాటు జరుగనున్న ఫుట్ బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌ను మంగళవారం నార్త్ పోలీస్ సబ్ డివిజన్ ఎసిపి అప్పలరాజు, స్థానిక సిఐ బి.తిరుమలరావుతో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి, సభ్యులు కెఎస్ఎన్.మూర్తి, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, జివిఎంసి మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, అక్కర మాని చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏనుగుల దినోత్సవం


ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో మంగళవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఏనుగులపై చర్చ, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. అంతకు ముందు ఏనుగుల పర్యావరణ ప్రాముఖ్యత, వాటి సంరక్షణ తదితర విషయాలపై జూ క్యూరేటర్ జి.మంగమ్మ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు భారతి, గ్లోబల్ స్కూలు యాజమాన్యం సభ్యులు పాల్గొన్నారు.

గంభీరంలో 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నిర్వహించిన సభలో కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో అమలుకాని హామీలిచ్చి నేడు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపిలు బొట్ట రామకృష్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఐఐటి గౌహతిలోని ఎలక్ట్రానిక్స్, ఐసిటి అకాడమి ఆధ్వర్యాన ఇంజినీరింగ్ రంగంలో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనాలు అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) మంగళవారం ముగిసింది. ఐఐటి గౌహతి ప్రొఫెసర్ ఆర్యభట్ట సాహు, ప్రొఫెసర్ గౌరవ్ త్రివేది, ఐఐటి జబల్‌పూర్ ప్రొఫెసర్ అతుల్‌గుప్తా, ఎన్ఐటి పాట్నా ప్రొఫెసర్ డాక్టర్ భాస్కర్ మండల్ పాల్గొని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఇంజినీరింగ్‌లో ఆటోమేషన్, కృత్రిమ మేధ, సిగ్నల్ ప్రాసెసింగ్, డేటా ఎనలిటిక్స్‌లలో పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రాధాన్యతను వారు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు అధునాతన ఇంజినీరింగ్ ఆవిష్కరణలకు పైథాన్ కీలకమని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో నూతన ఆవిష్కరణలకు పైథాన్ ప్రోగ్రామింగ్ ప్రయోజనకరంగా నిలుస్తోందని, అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా బోధన పరిశోధనలో ఉత్తమ ఫలితాలు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్లు డాక్టర్ వి.జ్యోతి, డాక్టర్ కరుణకుమారి, డాక్టర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇంజినీరింగ్ అధ్యాపకులు, నౌకాదళ అకాడమి సిబ్బంది హాజరయ్యారు.




విజయశ్రీ హాస్పిటల్ డాక్టర్లను సన్మానిస్తున్న ఆర్ఎంపిలు

ప్రాథమిక వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి-కొమ్మాది : సీజనల్ జ్వరాలు, బిపి, సుగర్ తదితర రోగాలకు సంబంధించి ప్రాథమిక వైద్యంపై గ్రామీణ వైద్యులకు విజయశ్రీ హాస్పిటల్ డాక్టర్లు సునీల్‌కుమార్, వేణుమాధవి అవగాహన కల్పించారు. కొమ్మాది గ్రామీణ వైద్యులు ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్లు సునీల్‌కుమార్, వేణుమాధవి మాట్లాడుతూ, పక్షవాతం వచ్చిన రోగిని 5గంటల వ్యవధిలో తీసుకొస్తే రెండు రోజుల్లో నయంచేయవచ్చని తెలిపారు. న్యూరో ఫిజిషియన్ పరిధిలో రిహాబిలిటేషన్ విజయశ్రీలోనే ఉందని చెప్పారు. రోగులకు సరైన మార్గంలో ఆరోగ్యం అందించడంలో గ్రామీణ వైద్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం విజయశ్రీ డాక్టర్లను గ్రామీణ వైద్యులు కెవిన్.రావు, కోటేశ్వరరావు, కనకారావు, నాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి, తగరపువలస, మధురవాడ గ్రామీణ వైద్యులు హాజరయ్యారు.

'అపోలో'లో కేన్సర్ కేర్ హెల్ప్‌లైన్ సెంటర్



కేన్సర్ కేర్ హెల్ప్ లైన్‌ను ప్రారంభిస్తున్న అపోలో వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కేన్సర్ రోగుల అనుమానితులు, కేన్సర్ రోగంతో బాధపడుతున్న వారు, చికిత్స చేసుకున్న తర్వాత మందులు తీసుకుంటున్న వారి కోసం దేశంలో మొదటి సారిగా ఆరిలోవ అపోలో ఆసుపత్రి టోల్ ఫ్రీ నెంబర్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సదర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అపోలో కేన్సర్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, సర్జికల్ అంకాలజీ అండ్ చీఫ్ రోబోటిక్ సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ చంద్ర కళ్యాణ్, అపోలో వైద్యులు డాక్టర్ రాకేష్‌రెడ్డి బోయా, డాక్టర్ ప్రదీప్ వెంత్రపాటి మాట్లాడుతూ భారతదేశంలో కేన్సర్ కేసుల సంఖ్య 2040 నాటికి 2.08 మిలియన్లకు పెరుగుతుందని అంచనా ఉన్నట్లు తెలిపారు. 2020 నుండి చూస్తే ఇది 57.08 శాతం పెరుగుదలకు సమానం అన్నారు. సకాలంలో మద్దతు అందించడం, ప్రారంభ దశలోనే చికిత్స అందించడం, నమ్మకమైన సమాచారం పొందటం ఎప్పుడూ సమస్యగానే ఉంటుందని, ఈ అవసరాన్ని తీర్చేందుకు అపోలో కేన్సర్ సెంటర్ దేశంలో మొట్టమొదటి సారిగా అంకిత భావంతో 24 బై 7 కేన్సర్ కేర్ హెల్ప్ లైన్ 18002031066 నెంబరును ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కేన్సర్ రోగులు, వారి కుటుంబాలకు వ్యక్తిగత మార్గదర్శకత్వం, నిపుణుల చేత వైద్య సలహాలు, కౌన్సెలింగ్ అవయవ- నిర్దిష్ట నావిగేషన్ సహాయం, సమగ్ర మద్దతును సకాలంలో అందించడంలో ముఖ్యమైన ముందడుగు అన్నారు. అపోలో ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్, గ్రూప్ ఆఫ్ అంకాలజీ అండ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ దినేష్ మాధవ్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి సారిగా టోల్ ఫ్రీ కేన్సర్ హెల్ప్‌లైన్ ప్రారంభించడంతో అందుబాటులో ఉన్న కేన్సర్ సంరక్షణ, ముందస్తు గుర్తింపు, కారుణ్య సంరక్షణ పట్ల తమ నిబద్ధతను మరింతగా పునరుద్ఘాటిస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో ఈ నెల 6,7 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సంబంధిత విద్యార్థులను స్కూల్‌లో అభినందించారు. వారికి తర్ఫీదు ఇచ్చిన యోగా టీచర్ లక్ష్మిని కూడా అభినందించారు. విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతమ్మధారలోని శ్రీ కృష్ణ మందిరంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థులు పాల్గొని,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో 5,6,7, 9,10 తరగతుల విద్యార్థులు ఇ.శశిధర్, ఎ.వెన్నెల, కె.అవినాష్, ఎ.లోహిత్, బి.కోమలి, ఆర్.తనూజ, కెవి.శివానందు, సిహెచ్.నిహారిక ఉన్నారని తెలిపారు

గుడిలోవ విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం: విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీతమ్మధారలోని శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో గుడిలోవ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీలలో 29 మంది విద్యార్థులు పాల్గొనగా 9 మంది రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానాచార్యులు తెలిపారు.

పరిశ్రమలకు భూములివ్వం

ప్రజాశక్తి పద్మనాభం: పరిశ్రమలకు భూమిని ఇవ్వబోమని రైతులు మంగళవారం తహశీల్దార్ కె.ఆనందరావుకు తేల్చి చెప్పేశారు. రెండు నెలల క్రితం కృష్ణాపురం పంచాయతీ పరిధి సర్వేనెంబర్ 88.93లో 24 ఎకరాల భూమిని కేటాయించామని, అంతకుమించి ఇవ్వడానికి తాము ఒప్పుకోబోమని రైతులు తేల్చి చెప్పేశారు. ఈ భూముల్లో సుమారు 60 మంది రైతులు 30 సంవత్సరాలుగా సాగులో ఉన్నారని తెలిపారు. గతంలో ఎంఎస్ఎమ్ పార్కు కోసం 24 ఎకరాలు మాత్రమే తీసుకుంటామని చెప్పారని, ప్రస్తుతం నాలుగు రోజులుగా ఇంకా మిగిలి ఉన్న భూమిని చదును చేస్తున్నారని రైతులు వివరించారు. 66 ఎకరాల్లో రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా చదును చేయడంపై రైతులు మండిపడ్డారు. దీనిపై స్థానిక తహశీల్దార్ స్పందించి రెండు రోజుల్లో గ్రామంలో గ్రామసభ ఏర్పాటుచేస్తామని చెప్పారు. న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.నారాయణరావు, జి.అప్పలరాజు, బి.అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూఅధికారులు

అదాని గంగవరం పోర్టు రికార్డు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు లిమిటెడ్ (ఎజిపిఎల్) అత్యధిక లోతులో ఒక నౌకను విజయవంతంగా నిలిపిందని పోర్టు ప్రతినిధి తెలిపారు. వేదాంత లిమిటెడ్ కోసం 1,77,121 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను తీసుకొచ్చిన ఈ నౌక 18.2 మీటర్ల డ్రాఫ్ట్‌తో వచ్చిందని తెలిపారు. వేదాంత లిమిటెడ్‌తో కలిసి పని చేయడం వల్ల నౌకను సరిగ్గా నిలపడం, త్వరగా పనులు పూర్తి చేయడం, సరుకును ఖచ్చితంగా నిర్వహించడం సాధ్యమైందని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ముడిసరుకు దిగుమతులపై ఆధారపడిన పరిశ్రమలకు, ఈ సామర్థ్యాలు నేరుగా ఖర్చులను తగ్గించడం, సరఫరా గొలుసులను సులభతరం చేయడం, ప్రతి టన్నుకు పర్యావరణ ప్రభావం తగ్గించుకున్నందుకు సాయపడ్డాయని తెలిపారు. ఈ తాజా రికార్డు అదాని గంగవరం పోర్టు స్థితిని తూర్పు తీరంలో ఇష్టపడే సముద్ర గేట్‌వేగా మరింత బలపరిచిందని తెలిపారు.

డాక్టర్ కూటికుప్పలకు సోదర వియోగం


ప్రజాశక్తి-మాధవధార : పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు సోదరుడు అప్పారావు గుండెపోటుతో సోమవారం సాయంత్రం అయ్యప్పనగర్‌లోని తన నివాసంలో మృతిచెందారు. మంగళవారం మాధవధార శ్మశాన వాటికలో అప్పారావు అంత్యక్రియలు నిర్వహించారు. సోదరుని వియోగంతో బాధపడుతున్న కూటికుప్పల సూర్యారావును పలువురు ఓదార్చారు. పోర్టు ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అప్పారావు కుటుంబాన్ని పోర్టు ఉద్యోగులు కలిసి పరామర్శించారు

'విశాఖ'లో ఓరియంటేషన్ కార్యక్రమం

ప్రజాశక్తి- వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివి.ప్రదీప్‌వర్మ హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో, నిబద్ధతతో చదువులో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. కళాశాలలోని వనరులను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్, పి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, డాక్టర్ ఎం.ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి -గాజువాక : ఇగ్నో 2025 విద్యా సంవత్సరానికి ప్రవేశాల గడువును ఈ నెల 15వ తేదీ వరకు పెంచినట్లు ఎంవిఆర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.రామారావు తెలిపారు. దూరవిద్య ద్వారా వివిధ కోర్సులతోపాటు, ఆన్‌లైన్ కోర్సులకు కూడా గడువు పెంచినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జగన్మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కట్టమూరు సతీష్

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన సతీష్

ప్రజాశక్తి-సీతమ్మధార : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని జివిఎంసి డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్ మంగళవారం మర్యాదపూర్వకంగా మంగళగిరిలో కలిశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించాలని జగన్మోహన్‌రెడ్డి సూచించినట్లు కట్టమూరు సతీష్ తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు పాల్గొన్నారు.

గుండె పోటుతో ఖైదీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీ గుండె పోటుతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. జైలు అధికారుల కథనం ప్రకారం... అనకాపల్లి దుర్గాబజార్‌కు చెందిన కోలాటి బాలయోగి (75) పోక్సో కేసులో శిక్ష పడి 2022 అక్టోబర్ 17 నుంచి కేంద్రకారాగారంలో ఖైదీగా ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం కేంద్రకారాగారంలో గుండె పోటు వచ్చి కుప్పకూలిపోయాడు. జైలు అధికారులు వెంటనే చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందినట్టు తెలిపారు.

అదాని స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : అదాని స్మార్ట్ మీటర్లు, పెంచిన కరెంటు ఛార్జీలు, విద్యుత్తు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ హిందుస్థాన్ షిప్ యార్డు కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం షిప్ యార్డు గేటు దగ్గర నిరసన తెలిపారు. సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు కె.పెంటారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడితే ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నాయకుడు లోకేష్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని ప్రజలకు పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటినే పెడుతున్నారని విమర్శించారు. దేశంలో ప్రతి వ్యక్తి ప్రతిక్షణం వినియోగించే విద్యుత్‌ను మిత్రుడైన అదాని చేతిలో పెట్టడానికి మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకొచ్చిందని తెలిపారు. విద్యుత్ ఇంతవరకు రాష్ట్రాల పరిధిలో ఉండేదని, ఇప్పుడు కేంద్రం తన గుప్పిట్లోకి లాక్కుందని వివరించారు. విద్యుత్ మొత్తాన్ని ప్రైవేటీకరించి ప్రజలపై పెను భారాలు వేసి అదానికి రూ. వేల కోట్లు సంపద పోగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. వీటిని నిలువరించేందుకు సిఐటియు, సిపిఎం అనేక రూపాల్లో పోరాడుతోందని, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు పి పైడిరాజు, ఎ.సత్యారావు, జి.నరేష్, బి.శ్రీను, ఎన్.శ్రీను, ఎస్.వాసు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : అదాని స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని కెవిపిఎస్ గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన సింహగిరి కాలనీలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న మాట్లాడుతూ, నష్టదాయకమైన అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించొద్దని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు గొలగాని అప్పారావు, గణేష్, సిపిఎం నాయకులు బంగారు నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రజలపై అధిక విద్యుత్తు భారాలు వేసే స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ: నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, కాళ్ల తెలయ్యబాబు మాట్లాడుతూ ఆదాని



గాజువాకలో కెవిపిఎస్ ఆధ్వర్యాన....

స్మార్ట్ మీటర్లను బలవంతంగా దుకాణాల్లో బిగించారని, ఇళ్లకు బిగించే ప్రయత్నాలు చేస్తున్నారని, దీనివలన ప్రజలపై అధికంగా విద్యుత్ భారం పడుతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగించే విషయంలో ప్రజలపై ఒత్తిడి తీసుకురావద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో బుగిడి నూక అప్పారావు, దాడి రమణ, ఈశ్వరరావు, కెవిఐఎస్ రామచంద్రరావు, బిఎన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

మెట్రో లైన్ ప్రాజెక్టును పరిశీలించిన గణబాబు



మెట్రో ప్రాజెక్టును పరిశీలిస్తున్న గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి ఎన్ఎడి కొత్త రోడ్డు వరకు ప్రతిపాదించిన మూడు మెట్రో రైల్వే స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో కలసి ప్రభుత్వ విప్ గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేషన్ వద్ద పార్కింగ్ స్లాట్లను పెంచాలని, ఎయిర్ పోర్టు ప్రయాణికులకు వీలుగా ఎయిర్ పోర్టు దగ్గరలో ఒక స్టేషను, అతి దగ్గరగా ఉండే ఎన్ఎడి కొత్త రోడ్డు ఒక స్టేషన్ చాలా ముఖ్యమైనవని, వాటి మీద ప్రజలకు ప్రాథమిక అవసరాల నిమిత్తం దీర్ఘకాలిక ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్రో చీఫ్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ యుజెఎం రావు, ప్రాజెక్టు మేనేజర్ వసంత్, ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ సిఐ దశరథ్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రవణ, టిడిపి నాయకులు ఎలమంచిలి ప్రసాద్, వై.తిరుమలరావు, అరుణ్, ఆడారు భాస్కర్, గణపతిరావు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం

ప్రజాశక్తి- యంత్రాంగం

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

మారికవలసలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించి మింగించారు. ఈ కళాశాలలో ఉన్న 310 మంది విద్యార్థులకుగాను 301 మందికి ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్‌కుమార్, జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.హారిక, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీచేశారు.



ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

పిహెచ్‌సిలో 'టిబి ముక్త్ భారత్ అభియాన్'



టిబి ముక్త్ భారత్ అభియాన్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి

ప్రజాశక్తి- మధురవాడ : పిఎం.పాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. పిఎం.పాలెం అర్బన్ ప్రైమరీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుజనే మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో 60 ఏళ్లపైబడిన వృద్ధులకు, ధూమపానం మద్యపానం అలవాటు ఉన్నవారికి, సుగర్ వ్యాధిగ్రస్తులకు, కిడ్నీ, కేన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, టిబి మందులు వాడి నయమైన వారికి, వారి కుటుంబ సభ్యులకు కఫం పరీక్షను చేస్తున్నట్లు తెలిపారు. కఫం పరీక్షలో నిర్ధారణ అయిన రోగికి 6 నెలల పాటు ఉచితంగా మందులను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ టిబి యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం, సురేష్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభవన్ ముట్టడికి తరలిన నాయకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తలొగ్గి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆగస్టు 1వ తేదీన విడుదల చేసిన జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి స్టూడెంట్స్ జెఎసి పిలుపు మేరకు రాష్ట్ర రాజధాని మంగళగిరి, విద్యాభవన్ ముట్టడి కార్యక్రమానికి భీమిలి ప్రాంతం నుంచి పలువురు విద్యార్థి జెఎసి నాయకులు మంగళవారం తరలి వెళ్లినట్లు రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్, కార్యదర్శి వియ్యపు ఎర్రాజీ తెలిపారు. విద్యార్థి, ప్రజా సంఘాలను విద్యాసంస్థల ఆవరణకు వెళ్లరాదని ప్రభుత్వం జిఒ విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రశ్నించే హక్కును కాలరాయడం అన్యాయమన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి -మధురవాడ : పిజిఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జోన్ 2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆదేశించారు. జివిఎంసి 7వ వార్డు పరిధి ఆదిత్య నగర్ వాసులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన జోనల్ కమిషనర్, 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ఆధ్వర్యాన మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. రోడ్డుకడ్డంగా అక్రమగా నిర్మించిన గోడను వెంటనే తొలిగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్ఎస్.నాయుడు, సెక్రటరీ నాగోతి సూర్య ప్రకాశరావు, టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకటరావు, ఆదిత్యనగర్‌వాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు వాటర్ ప్రూఫ్ టెంట్, సైడ్ వాల్స్‌ను మంగళవారం పూర్వ విద్యార్థి సూర్య అందజేశారు. ఇందుకు గాను అతన్ని ఇన్‌ఛార్జి హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి.ప్రసాదరావు, ఎస్ఎంసి ఛైర్మన్ బి.సోమేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలని నిరసన


తాళ్లపాలెంలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-కశింకోట

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోనున్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్‌లో విశాఖ మోటార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు పథకం అమల్లోకి రాబోతుందని, దీనివల్ల ఆటోలకు డిమాండ్ తగ్గి తమ జీవనోపాధి దెబ్బతింటుందని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, శ్రీవిజయలక్ష్మి ఆటో యూనియన్ అధ్యక్షుడు పచ్చికూర నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కర్రి లోవరాజు, జర్రిపోతుల సన్యాసినాయుడు, బూడిద శివ, గుమ్మడి నారాయణరావు, రమణ, శ్రీరామదాసు శ్రీనివాసరావు, పుర్రె నర్సింగరావు, మదిన శ్రీనివాసరావు, బండా బాబురావు, కోన రాజు, ఆనంద్ కుమార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్న సందర్భంగా నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని మంగళవారం నర్సీపట్నం పాత బస్సు స్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఉన్నత చదువులు చదువుకొని స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ఉచిత బస్సు ప్రయాణంతో ఎంతో నష్టపోతారని, వీరికి వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.25,000 భృతిని ఆటో లైసెన్స్ పొందిన ప్రతి కార్మికుడికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫైన్ లు వంటివి రద్దు చేయాలని, డీజిల్ ,గ్యాస్ ధరలు తగ్గించాలని, ఆటో కొనుగోలుకు ఐదు లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఎం.రాజు, ఎల్ రాము, ఎల్.కృష్ణ, జి.నూకరాజు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో ఆందోళన చేస్తున్న దృశ్యం


రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభించిన దృశ్యం

ఐద్వా పోరాట విజయం

- పరవాడ టిడ్కో, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ టిడ్కో, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలకు రేషన్ డిపో ఏర్పాటు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన స్థానిక మహిళలు చేసిన పోరాటం ఫలించింది. ఈ కాలనీల వాసుల డిమాండ్ నెరవేరింది. ఈ కాలనీల్లో రేషన్ పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం నాయకత్వంలో ఐదు నెలల నుండి స్థానికులు పలు రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ప్రతినెల 5, 6, 7 తేదీలలో స్థానిక కళ్యాణ మండపంలో రేషన్ పంపిణీ చేయనున్నారు. ఈ డిపో నిర్వహణ బాధ్యత డీలర్ కట్టుమూరి భవాని (డిపో నెంబర్ 8) తీసుకున్నారు. ఈ నెల రేషన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. భవిష్యత్తులో కూడా సమయానికి రేషన్ అందిస్తామని డీలర్ తెలిపారు. ఈ కాలనీలలో నివసించే కుటుంబాలు పూర్తిగా రేషన్ బియ్యంపైనే ఆధారపడుతున్నాయి. తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం డిపో ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, మండల అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ, స్థానిక కమిటీ సభ్యులు అరుణ, వరలక్ష్మి, కె.లక్ష్మి, రాజకుమారి, బేగం, సాయి వెంకటి, నాగదేవి, వరహాలమ్మ, విమల తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు భూములివ్వం

ప్రజాశక్తి- సబ్బవరం : ల్యాండ్ పూలింగ్‌కు భూములిస్తే జీవనోపాధి కోల్పోతామని, ఎట్టి పరిస్థితులలోనూ తాము ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వబోమని మండలంలోని ఏ. శిరసపల్లి, బంగారమ్మ పాలెం రైతులు స్పష్టం చేసారు. మండల కేంద్రంలోని స్థానిక జనసేన కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు ఆయా గ్రామాల రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ నెల 7న ఎ.సిరసపల్లి, బంగారమ్మ పాలెం రైతులకు గ్రామసభ నిర్వహించి రెవిన్యూ అధికారులు ల్యాండ్ పూలింగ్ కు భూములు ఇవ్వాలని తెలిపారని చెప్పారు. తమ జీవనోపాధికి ఆ భూములే ఆధారమని అధికారులకు చెప్పామని, ఎట్టి పరిస్థితులలోనూ భూములు ఇవ్వమని ఎమ్మెల్యేకు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, టీడీపీ సీనియర్ నేత దొడ్డి సూర్యప్రకాశరావు, మాజీ పాల సొసైటీ అధ్యక్షుడు ఎస్. మూలి నాయుడు, జనసేన నేతలు బలిరెడ్డి అప్పారావు, కర్రి కనకరాజు, బంతి కోళ్ల పద్మ, పల్లి మంగరాజు పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమవతి మంగళవారం ఐఇసి క్యాంపెయిన్ 2025' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూపొందించిన పోస్టర్ను ఆమె ఆవిష్కరించారు. ఈ ప్రచారం రానున్న రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా యువతపై దృష్టి సారించి హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హైమవతి, ఏఆర్‌టి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియదర్శిని, ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ డాక్టర్ స్పందన ప్రశాంతి పాల్గొన్నారు.

యోగా పోటీల్లో శ్రీకృష్ణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖపట్నం డిస్ట్రిక్ట్ యోగా ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో బి.నరసింగరావు (45) ప్రథమ బహుమతి, బి.కార్తీక్ (8-10) నాలుగోబహుమతి, బి.జయశ్రీ(10-12) నాలుగవ ప్రైజ్ సాధించారు. వీరిని తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబీ, కర్రి జోగినాయుడు శారదా వ్యాలీ డెవలప్మెంట్ సమితి సెక్రటరీ, యం.అజయ్, యస్.గణేష్, యస్. బోసుబాబు, పి.గణపతి, గ్రామ పెద్దలు అభినందించారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి సెలూన్ షాపులకు 150 యూనిట్ నుండి 200 యూనిట్లు వరకు ఉచిత కరెంట్ అమలుకు జీవో విడుదల చేసి ఇచ్చిన నేపథ్యంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, జిల్లా నాయి బ్రాహ్మణ డైరెక్టర్ పుల్లేటికుర్తి అప్పల రమేష్, గౌరవ అధ్యక్షులు గుడివాడ సూరిబాబు, జిల్లా అధ్యక్షులు కేసనకుర్తి అప్పారావు పాల్గొన్నారు.

చినపూడి నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి


ఎపిఐఐసి జోనల్ కార్యాలయం వద్ద నిరసన


ఎపిఐఐసి జోనల్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్ఇజెడ్‌లో భూములు కోల్పోయిన చినపూడి గ్రామ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని ఎపిఐఐసి జోనల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వాసితులు నిరసన తెలిపారు. తమ సమస్యలపై నినాదాలు చేశారు. తక్షణం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం నాయకులు ఆర్.రాము, సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉపాధి కల్పించకుండా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పనులు కల్పించడం అన్యాయమన్నారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. గ్రామ చుట్టూ నిర్మాణ పనులు చేపట్టడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ఇంటి స్థలాలు వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజీవ్, మహేష్, రాహుల్, నిర్వాసితులు, మహిళలు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ లోపాలను సరిదిద్దాలి

సిజిఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ


వర్చువల్‌గా విచారణ చేస్తున్న సిజిఆర్ఎఫ్ చైర్మన్

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ సర్వీస్ కనక్షన్లకు చేసిన ఆధార్ సీడింగ్లో లోపాలను సరిదిద్దడానికి త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించి తక్షణం నివేదికలు అందజేయాలని సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి.సత్యనారాయణ ఏపిఈపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్లను ఆదేశించారు. కొంతమంది నిరుపేద విద్యుత్ వినియోగదారుల ఆధార్ నెంబర్‌కు ఆర్థిక స్థితిమంతులు/ ఇతరుల విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు సీడింగ్ అయ్యాయని, దీనివల్ల ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని బడుగు, బలహీన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యుత్ వినియోగదారులు అర్హతలుండీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. డీ సీడింగ్ చేయాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ సీజీఆర్ఎఫ్‌లో చేసిన ఫిర్యాదుపై మంగళవారం వర్చువల్ విధానంలో విచారణ జరిగింది. విచారణలో ఆయనతో పాటు ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని ఆయా జిల్లాల సూపరింటెండెంట్ ఇంజినీర్లు పాల్గొని కొంతమంది నివేదికలు సమర్పించారు. ఇంకొంతమంది సమర్పించాల్సి ఉంది. ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్లు మాట్లాడుతూ ఆధార్ డీ సీడింగ్ కోసం స్పెషల్ డ్రైవ్ ద్వారా సరిచేస్తున్నామన్నారు. గ్రామ వార్డు సచివాలయాల్లో త్వరితగతిన అప్‌డేట్ కాకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ 11 జిల్లాల నుంచి ఆధార్ డీ సీడింగ్ నివేదికలను త్వరితగతిన ఇటు ఫిర్యాదుదారుకు, అటు సీజీఆర్ఎఫ్‌కు అందజేయాలని ఆదేశిస్తూ ఈ నెల 19వ తేదీకు కేసును వాయిదా వేశారు. విచారణలో సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎస్.సుబ్బారావు (ఫైనాన్స్) ఎస్.రాజాబాబు (టెక్నికల్), ఎన్.మురళీకృష్ణ (ఇండిపెండెంట్) పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం పట్ల సిఐటియు హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆశా వర్కర్లకు ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు, 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, గ్రాట్యుటీ లక్ష యాభై వేలు రూపాయలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. గత 20 సంవత్సరాలుగా ఆశా వర్కర్ల సమస్యలపై సిఐటియు పోరాటాలు ఫలితంగా ఈ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పదేపదే గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పంద జీఓలను విడుదల చేయాలని ఆందోళన చేయడంతో, ప్రభుత్వం నేడు ఉత్తర్వులను విడుదల చేసిందని తెలిపారు. ఇంకా సర్వీస్‌లో ఉండి చనిపోయిన ఆశ వర్కర్ల స్థానంలో వారి కుటుంబానికి ఉపాధి కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్లు పరిష్కరించాల్సిన ఉందన్నారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.శాంతి, ఈ పార్వతి, రాష్ట్ర కార్యదర్శి వై సత్యవతి, వరలక్ష్మి, రామలక్ష్మి, సూర్యకళ తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజల గొంతుకై పోరాడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాజ హితం కోసం ప్రజల గొంతుకై సిపిఐ శ్రేణులు పోరాడాలని ఆ పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో మంగళవారం జరిగిన సిపిఐ అనకాపల్లి జోనల్ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై ధరాభారాన్ని మోపి, పన్నుల రూపంలో పేద ప్రజల నుండి వసూలు చేసిన దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పలుమార్లు సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై పెనుభారం మోపిందన్నారు. శ్రీరామదాసు అబ్బులు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గసభ్యులు గురుబాబు పాల్గొన్నారు. అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎస్.భద్రం కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు.

సబ్సిడీపై పశు దాణా పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని అచ్చెర్ల సచివాలయం వద్ద రైతులకు సబ్సిడీపై పశు దాణా మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది నాగమణి, కూటమి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, నైనంశెట్టి భూష, గుడబండి జాన్, దుద్దేటి శ్రీను, సర్వసిద్ధి నాగేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న పోలీసులు

డ్రోన్‌తో పోలీసుల నిఘా

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో ఆధునిక పరిజ్ఞానం డ్రోన్ వినియోగించి వాహనాలు రాకపోకలు, ఓపెన్ డ్రింకింగ్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని పేదమదిన కూడలిలో వాహనాల రాకపోకలపై పర్యవేక్షించారు. సమీప ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం కొనసాగించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రాముునాయుడు, రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు సందర్భంగా మంగళవారం అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం వద్ద నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాజువాక బస్‌స్టాప్ వద్ద పతాకావిష్కరణ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.బాబ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాముునాయుడు, దొరబాబు మాట్లాడుతూ బ్రిటిష్ తెల్ల దొరలను తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ విద్యను కాషాయీకరణ చేయడానికి ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.గురుబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎల్వై.కాంతమ్మ క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి, గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. కోమార బాబురావు అనే రైతు పొలంలోని వరి నాట్లను పరిశీలించిన ఆమె, అక్కడికి వచ్చిన రైతులతో చర్చించి, ప్రస్తుత సీజన్‌లో పంటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ మార్పుల ఆధారంగా పాటించాల్సిన వ్యవసాయ పద్ధతులపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకుడు దొర, తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రెటరీ కడిమి నాగేశ్వరరావు, వియ్యపు రాజబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకొని, దిగుబడులు సాధించాలని స్థానిక వ్యవసాయ అధికారి సోమశేఖర్ అన్నారు. మండలంలోని ఆర్‌వై అగ్రహారం, కేజే.పురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా ప్రకృతి వ్యవసాయంలో జీవామృతాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రకృతి వ్యవసాయం కో ఆర్డినేటర్ పాత్రుని నాయుడు, రెండు గ్రామాల ఉప సర్పంచ్‌లు లెక్కల అచ్చిబాబు, గొర్లి అప్పారావు, రైతులు, వీఏఏ కళ్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.కోటపాడు వ్యవసాయాధికారి సోమశేఖర్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించాలి

జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశించారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిని ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం ద్వారా తనిఖీ చేయాలని సూచించారు. పరిశ్రమలలో సేఫ్టీ ట్రైనింగ్ జరుగుతున్న విధానం, ప్రమాదాలు జరిగినప్పుడు త్వరితగతిన తీసుకోవలసిన సహాయక చర్యలు, స్పందించే విధానంపై తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు డ్రంక్ అండ్ డ్రైవింగ్, అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వంటి అంశాలపై కఠిన ఎన్‌ఫోర్స్‌మెంట్ చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు రౌడీ షీటర్లు, చెడు నడవడిక కలిగిన వారిపై ప్రత్యేక నిఘా, వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సిఐ నమ్మి గణేష్, ఎస్సైలు జి.సుధాకర్, ఎం.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి : స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పారిశ్రామిక ప్రమాదాలు పట్ల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. సముద్ర స్నానాలు చేసే యువతకు హెచ్చరికలు జారీ చేయాలని, స్థానిక మత్స్యకారులతో కలిసి కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. తరచూ రిపోర్ట్ అవుతున్న నేరాలు గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాంబిల్లి సిఐ సి హెచ్.నర్సింగరావు, ఎస్సై నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలి



సిసిఎల్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకన్న, భవాని

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం ఒమ్మలి, జగన్నాధపురం, కృష్ణాపురం, రావికమతం మండలం కొమిర గ్రామాల్లో 6వ విడత భూ పంపిణీలో ఉరవకొండలో 450 మందికి పట్టాలు ఇచ్చిన భూములకు సర్వేనెంబర్లు సరి చేసి వెంటనే వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, వి.మాడుగుల మండల కార్యదర్శి కె.భవాని మంగళవారం విజయవాడలో సిసిఎల్ జి.జయలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 6వ విడత భూ పంపిణీలో ఉరవకొండ చుట్టు వందలాది మంది పేదలకు, గిరిజనులకు, దళితులకు నాటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. పట్టాలు ఇచ్చిన సర్వే నెంబర్లు గల భూములు వెబ్ ల్యాండ్‌లో నమోదు కాలేదని పేర్కొన్నారు. అంతే కాకుండా పట్టాలిచ్చిన సర్వే నెంబర్లు, పేదలు సాగులో ఉన్న సర్వే నెంబర్లు గల భూములకు సంబంధం లేదని తెలిపారు. దీని వల్ల పట్టాదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలు వలన పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు, స్కీములు అమలు కావడం లేదన్నారు. 2016 నుండి అనేకసార్లు వి.మాడుగుల తహశీల్దార్‌కు, జిల్లా కలెక్టర్‌కు, గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లోనూ అనేక సార్లు దరఖాస్తులు పెట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా సర్వే నెంబర్లు సరిచేసి పట్టాలిచ్చిన భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని కోరారు. అలాగే ఇప్పటికే సాగులో ఉండి పట్టాలు ఇవ్వవారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు.

పేదరికం నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి-రాంబిల్లి : పేదరికం నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. జిల్లా ఎంఎస్ఎంఇ భవనంలో మంగళవారం పారిశ్రామికవేత్తలతో పి4పై సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అనిత మాట్లాడుతూ పేదరికం లేకుండా చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు కూడా ఒక భాగమేనని, పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో ఎలమంచిలి నియోజకవర్గం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండేలా అందరూ కలిసి స్నేహభావంతో పని చేయాలని, కంపెనీ యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ కృష్ణన్, పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి కోర్టులో మౌలిక సదుపాయాల సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి కోర్టుల సముదాయంలో కక్షిదారులు, వృద్ధులు, వికలాంగులకు, వాళ్ల సహాయకులకు కల్పిస్తున్న కనీస వసతులు (టాయిలెట్స్, మంచినీరు, కుర్చీలు, బెంచీలు, వాహన పార్కింగ్, క్యాంటిన్) సమాచారాన్ని ఆర్టీఐ చట్టం దరఖాస్తుదారు కాంగ్రెస్ వెంకటరమణకు అందజేయాలని అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆర్టీఐ చట్టం ప్రజా సమాచార అధికారి, సీనియర్ సూపరింటెండెంట్‌కు రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెలువడి నెల రోజులు దాటినా ఆయన పూర్తిగా స్పందించకపోవడంతో మంగళవారం హైకోర్టుకు చేసిన ఫిర్యాదు వివరాలను ఆర్టీఐ ఉద్యమకర్త కాంగ్రెస్ వెంకటరమణ విలేకర్లకు వివరించారు. 21 అంశాల సమాచారాన్ని ఇవ్వాలని ఏప్రిల్ 28న దరఖాస్తు చేయగా తప్పుతోవపట్టించు సమాచారం, వ్యక్తిగతం అంటూ తిరస్కరించారని, రాష్ట్ర హైకోర్టుకు అప్పీలు చేయగా జూలై 26న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ విచారణ చేశారని వెంకటరమణ తెలిపారు. అనంతరం దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని ఉచితంగా అందజేయాలని, ఆర్టీఐ అధికార యంత్రాంగం అందించిన సమాచారం అస్పష్టంగా ఉందని, కోర్టు అద్దె, కోర్టు భవన యజమానితో జరిగిన ఒప్పంద కాపీలు వ్యక్తిగతం కాదని, ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన సమాచారమని, కాబట్టి ఇచ్చి తీరాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారని పేర్కొన్నారు. కాగా ఉత్తర్వు వెలువడి నెల రోజులు దాటినా సమాచారం ఇవ్వకపోగా ఫోన్‌లో సంప్రదింపులు చేయడం విచారకరమన్నారు. దీంతో రాష్ట్ర హైకోర్టుకు ఫిర్యాదు చేశామని కాంగ్రెస్ వెంకటరమణ తెలిపారు.

రాహుల్ గాంధీకి మద్దతు తెలపాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతున్న రాహుల్ గాంధీకి దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తనకాల అనంతరావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఎన్నికల కమిషన్ తన బాధ్యతలు మరిచి అక్రమాలకు చోటు ఇవ్వడం అన్యాయమన్నారు. ఎన్నికల కమిషన్ అక్రమాలపై పోరాడుతున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆధారాలతో నిరూపిస్తే ఎన్నికల కమిషన్ చోద్యం చూస్తుందన్నారు. రాహుల్ గాంధీ మద్దతుగా 9650003426 ఫోన్ నెంబర్‌కు మిస్డ్ కాల్ గాని, మెసేజ్ చేసి మద్దతు పలకాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంపీఆర్ రాహుల్, పరవాడ రమణ, రావి రామ సత్యం, రవి పాల్గొన్నారు.

నేడు దేవరాపల్లిలో మెగా ఉద్యోగ మేళా

ప్రజాశక్తి- అనకాపల్లి : మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో 16 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదోతరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్న యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగా నైపుణ్యం యాప్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు మెగా ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను వెబ్ సైట్ https://naipunyam.ap.gov.in/user-registration లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81063 27482 నెంబరుకు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

గౌరీ గ్రంథాలయం నూతన కమిటీకి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం శ్రీ గౌరీ గ్రంథాలయం నూతన కమిటీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అభినందనలు తెలియజేసి చిరు సత్కారం చేశారు. అధ్యక్షుడుగా ఎన్నికైన బుద్ధ రమణాజీ, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, ఉపాధ్యక్షులు యల్లపు శ్రీను, జాయింట్ సెక్రటరీ బుద్ధ జోగినాయుడు, కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జగన్నాథ స్వామి ఆలయం చైర్మన్ దాడి బుజ్జి, పి.చందు, పీడి. ప్రసాద్, భాను చందర్ (అఖి) పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన డిఇఒ, డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని పి.ధర్మవరం అగ్రహారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు మంగళవారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటాపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పిల్లల హాజరు పట్టికను, రికార్డులను తనిఖీ చేశారు. వీరి వెంట ఎంఇఒ-2 కె.శ్రీరామ్మూర్తి ఉన్నారు.



సమీక్షిస్తున్న సందీప్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిజిపిఓ సందీప్ సూచించారు. మండలంలో దేవవరం పంచాయతీ ఒడ్డిమెట్ట గ్రామంలో మంగళవారం పర్యటించారు. శానిటేషన్, డ్రింకింగ్ వాటర్ సరఫరాను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని , ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరోనేషన్ చేయాలని సూచించారు. అనంతరం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి నిర్వహించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహితుల ఆందోళన

ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో గృహాలు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల్లో వివాహితులకు ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేసి, రూ. 25 ప్యాకేజీ చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలో అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆర్ఆర్ ప్యాకేజీ కోసం వివాహితులు ఆందోళన చేపట్టారు. మహిళలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్ సంఘీభావం తెలిపి, ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వివాహితులు మాట్లాడుతూ, భూసేకరణ చేపట్టినప్పుడు ఆనాటి అధికారులు గ్రామసభలు నిర్వహించి, ఆర్ఆర్ ప్యాకేజీ వివాహితులకు కూడా వర్తింప చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఆర్ ప్యాకేజీకి సంబంధించి మొదటి లిస్టులో తమ పేర్లు ఉన్నాయని, రెండవ లిస్టులో తమ పేర్లు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఇది సరైన పద్ధతి కాదని, అధికారులు, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హెూం మంత్రి వంగలపూడి అనిత తమ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, ఆర్ఆర్ ప్యాకేజీ వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, భూసేకరణలో గృహాలు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల్లో మగ సంతానం లేని తల్లిదండ్రులు వయోభారం పెరిగాక అడ పిల్లలే వారి యోగక్షేమాలు చూడాల్సి ఉంటుందన్నారు. అప్పుడు ఆ కుటుంబానికి ఆడ పిల్లలే పెద్ద దిక్కు అవుతారని, ఆస్తుల పంపకాలు, ఇతర విషయాలు, రిజర్వేషన్లు వంటి అంశాలపై మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్న ప్రభుత్వం, సర్వం కోల్పోతున్న నిర్వాసితు కుటుంబాల్లో ఆడపిల్లలకు ఆర్ఆర్ ప్యాకేజీ ఎందుకు వర్తింప చేయలేదని ప్రశ్నించారు. వివాహం అయిన ఆడపిల్లలకు 25 లక్షలు ప్యాకేజీ, 5 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండలం కార్యదర్శి ఎం.రాజేష్, మాడుగుల నాగలక్ష్మి, సూరకాసుల సృజన, తుమ్మల భవాని, ఉప్పలూరి మానస, సూరకాసుల కుమారి, మణిరాజు, సూరకాసుల మోహిణి,మడుగుల నూకరత్నం, కుప్పిన పల్లవి, మడుగుల నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు, వివాహిత మహిళలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పలుచోట్ల కంటి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం: మండలంలో గబ్బాడ గ్రామంలో మంగళవారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది, ప్రతిభ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ రాజబాబు సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరానికి వందమంది తరలి వచాచ్రఉ. కాట్రాక్ట్ ఆపరేషన్ 40 మందికి పడుతుందని, 30 మందికి ఉచిత కంటి అద్దాలు అందజేశారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజేశ్వరి, ఎల్వి ప్రసాద్ వైద్య బృందం పి.శివ, గీతాశ్రీ, మౌనిక, సంధ్య, శరత్, పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో ఎం.కోడూరు గ్రామ సచివాలయం లో, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవ రావు ఆధ్యర్యంలో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్యశిభిరం కార్యక్రమం నిర్వహించారు.ఈ శిబిరం లో సుమారుగా 70 మంది రోగులను కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే ఆపరేషన్ కొరకు 25 మందిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ ముమ్మిన రమణ బాబు , ఆర్ఎంపి డాక్టర్ హరిప్రసాద్, శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ దుర్గా భవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై ...

అధికారులను నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి-రావికమతం:తాము అడిగిన సమస్యలకు సమాధానం చెప్పే అధికారులు రానప్పుడు సమావేశాలు ఎందుకని సభలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రావికమతం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం రెండు గంటలకు ప్రారంభం కావలసిన సమావేశం మూడు గంటలకు ప్రారంభమైంది. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు పలువురు డుమ్మా కొట్టారు. ప్రతి సమావేశంలో ఇదే తంతు ఏర్పడటం పట్ల సభ్యులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. రావికమతం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన నిర్వహించారు. కవగుంట గ్రామపంచాయతీ రీ సర్వేలో జరిగిన అక్రమాలను సరి సరిచేయాలని, డి పట్టాలు కలిగిన గిరిజన రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి నోచుకోకపోవడం పట్ల కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి సభ దష్టికి తీసుకొచ్చారు.అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితాను ప్రజా ప్రతినిధులకు అందజేయాలని వ్యవసాయ అధికారి రమేష్ ను కోరారు. ఈ సమావేశంలో చర్చ జరగదు, పరిష్కారం జరగదు, సంతకాలే ముఖ్యమా అని కొత్తకోట ఎంపిటిసి పూడి దేవ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తకోట గ్రామంలో ఆక్రమనలకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని, షాపింగ్ కాంప్లెక్షలకు బహిరంగ వేలం వేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో 120 మంది రైతుల ఆధారు, బ్యాంకు లింకు సరిగా లేకపోవడంతో అన్నదాత సుఖీభవకు నోచుకోలేదని వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, సచివాలయంలో ఇచ్చిన విత్తనాలు నాటలేదని, ప్రైవేటు ఎరువుల మందుల షాపుల్లో మందుల డబ్బా 300 రూపాయలకు అమ్ముతున్నారని, రైతుల నుంచి వ్యాపారస్తులు డబ్బులు గుంజుతున్నారన్నారు. మరుపాక సర్పంచ్ మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాలకు హాస్టల్ వసతి సౌకర్యం లేకపోవడంతో పిల్లల రాకపాకులకు ఇబ్బంది జరుగుతుందన్నారు. హాస్టల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా ప్రతినిధులకు అధికారులు కనీస గౌరవం కూడా ఇవ్వలేదని, కనీస సమాచారం తెలియపరచలేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాల విభజన జరిగినప్పుడు ఒక సచివాలయ పరిధిలోకి మరొక గ్రామం ఎలా విలీనం చేస్తారని గొంప ఎంపిటిసి గెంజి సూర్యనారాయణ, రావికమతం ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, గుమ్మాలపాడు సర్పంచ్ బంటు సన్యాసినాయుడు అధికారులను నిలదీశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామస్వామి, తాసిల్దార్ అంబేద్కర్, వైస్ ఎంపీపీలు, రమణ భవాని ప్రసాదు, పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యుడు



గొలుగొండలో తనిఖీ చేస్తున్న పీడీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని గుండుపాల-1, చీడిగుమ్మల-2, పోలవరం, ఎరకంపేట, సీహెచ్.ఎర్రవరం అంగన్వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ, అనుబంధ పోషకాహార పంపిణీపై కార్యకర్తలకు తగు సూచనలు చేశారు. అనంతరం చీడిగుమ్మల, పోలవరం అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శ్రీగౌరి పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : మండలంలో అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. శివపురం, గచ్చపువీధి తదితర ప్రాంతాలలో ఈ తనిఖీలు చేసారు. అంగన్వాడీ కేంద్రములలో ప్రీ స్కూల్ నిర్వహణ, అనుబంధ పోషకాహార పంపిణీలపై తగు సూచనలు చేశారు.స్థానికంగా ఉన్న బాలసదనం కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జి వి రమణి, సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో రంగనాథన్ జయంతి



నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న రిటైర్డ్ అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జాతీయ గ్రంథాలయ పితామహులు ఎస్.ఆర్.రంగనాథన్ 133 జయంతి కార్యక్రమాన్ని నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత లైబ్రరీ రికార్డ్ అసిస్టెంట్ పి.కొండబాబు ను ఘనంగా సన్మానించడం జరిగింది. ప్రారంభంలో ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి సిబ్బంది పూలమాలవేసి నివాళు లర్పించారు, అనంతరం లైబ్రేరియన్ దమయంతి ఎస్.ఆర్.రంగనాథన్ ప్రవచించిన పంచ సూత్రాలను, వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా విశ్రాంత లైబ్రేరి యన్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులురెడ్డి మాట్లాడుతూ, రంగనాథన్ గ్రంథాలయాలకు చేసిన సేవలను వివరించారు. విధి నిర్వహణ పట్ల ఆయన అనుసరించిన నిబద్ధతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ గ్రంథాలయాధికారి, సార్వత్రిక విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు డి.మురళీధర్ మాట్లాడుతూ, యువత ఎస్.ఆర్.రంగనాథన్‌ను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో విజయాలు సాధించాలన్నారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ. శ్రీనివాసరావు, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివి.ప్రదీప్ వర్మ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రసాద్, డీన్ డాక్టర్ డి.శాంతారావు, ఒఎస్‌డి గాయత్రి రామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ కారుమూరి రామకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెందుర్తి : ఆర్ఆర్వి.పురంలోని ఆళ్వార్ దాస్ విద్యాసంస్థల ఆధ్వర్యాన జాతీయ గ్రంథాలయ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్ దాస్ హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కో-ఆర్డినేటర్ జివిఎస్.భగవాన్, ప్రిన్సిపాల్ సిహెచ్.రాజు, పి.సత్య, యు.గోపి, హేమచంద్రరావు, విజయకుమార్, రమణి పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్. రంగనాథన్ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయాధికారి జి.మురళీకృష్ణ, ఆర్.కన్నబాబు జ్యోతి ప్రజ్వలన చేసి రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.జగన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: కాంగ్రెస్ నేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఆ పార్టీ ఓబిసి చైర్మన్ బొంతు రమణ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు.గాంధీ కుటుంబాలకు అరెస్టులు కొత్త ఏమీ కాదని, దేశ స్వాతంత్ర్య కోసం అనేక సంవత్సరాలు జైలు జీవితం అనుభవించిన కుటుంభం అన్నారు. మత సామరస్యం, దేశ సమైక్యత కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబం అని, ఇటువంటి అరెస్టు లకు కాంగ్రెస్ భయ పడదని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలను డైవర్ట్ చేయడానికి బిజెపి చేసిన ఎత్తుగడ రాహుల్ అక్రమ అరెస్టు అని ఆమన పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ఎదుర్కొనే శక్తి నరేంద్ర మోడీకి లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ కి ఏదయినా హాని జరిగితే మోడీ భాద్యత వహించాలనీ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి: రావికమతం: మండలంలో గర్నీకం ఫైర్ స్టేషన్ సమీపంలో గల సివిల్ సప్లై గోడౌన్ పరిసర ప్రాంతాలలో ఎవరైనా ఆసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై తగు చర్యలు తప్పవని రావికమతం ఎస్సై రఘు వర్మ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సివిల్ సప్లై గోడౌన్ వద్ద " నో డ్రింకింగ్ జోన్ " అనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకుగాను గస్తీ ఏర్పాటు చేయడంతో పాటు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

పంచకర్లను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబును నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో మంగళ వారం మర్యాద పూర్వకంగా కలిశారు. రమేష్ బాబు అల్లూరి జిల్లా చింతపల్లి పర్యటనకు నర్సీపట్నం మీదుగా వెళుతున్న నేపథ్యంలో వీరంతా కలిసి ఘన స్వాగతం పలికారు. పంచకర్లతో పార్టీ విషయాలను కొద్దిసేపు చర్చించారు. నర్సీపట్నం నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల దేవి, ప్రసాద్ బాబు, నాయకులు రేగుబళ్ల శివ, పోలుపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిత్రపటాన్ని ఇస్తున్న నేతలు

నేడు ఆలయం పున:ప్రారంభం

ప్రజాశక్తి -మాడుగుల:మండలకేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద విజయాంజనేయ స్వామి ఆలయ పున్ణ ప్రారంభోత్సవం ఈనెల 13న జరగనుందని ఆలయ నిర్వాహకులు నాగోజి శ్రీను (రాఖీ) తెలిపారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం అదే రోజు సీతా రామ స్వామి కళ్యాణ మహోత్సవం, హెూమం, ఆలయ గోపురంపై కలశ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్న సమారాధన వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు.

కాలువ నీరు విడుదల

ప్రజాశక్తి-రోలుగుంట: మండలం కొమరవోలు ఆవ కుడి కాలువ వరినాట్లు 56 శాతం పూర్తయ్యాయి. ఈ మేరకు మంగళవారం ఎడమ కాలువ నీటిని విడుదల చేసినట్లు నీటి సంఘం ఆవ వైస్ ప్రెసిడెంట్ దంట్ల సత్యనారాయణ తెలిపారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ గొల్లవిల్లి సత్తిబాబు, మట్ల శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ

పంటల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గొలుగొండ:రైతులు పంట నమోదు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కె.సుధారాణి అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం సాలికమల్లవరం, కొత్తపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, కౌలు రైతుల గుర్తింపు కార్డులు విఆర్వో నుంచి పొందినట్లు అయితే ప్రభుత్వ అందించే రాయితీ ప్రోత్సాహకాలు పొందవచ్చునని తెలిపారు. అనంతరం వరి నాట్లు నాటే ముందు పాటించవలసిన పద్ధతులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కోటేశ్వరరావు, గిరిజనులు

గిరిజనుల సాగు భూములను..

రికార్డుల్లో నమోదు చేయాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ:గిరిజనుల సాగు భూములను రికార్డుల్లో నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ బుడ్డడపాడు గిరిజనులు గొలుగొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ, గొలుగొండ మండలం బొడ్డడపాడు గిరిజనులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములను గిరిజనేతరులకు కట్టబెట్టేందుకు తహశీల్దార్ తప్పుడు పంచనామా రిపోర్టులను తయారు చేశారన్నారు. బొడ్డడపాడు గ్రామానికి 10కిలోమీటర్ల దూరంలో పంచాయతీ కేంద్రం పాతమల్లంపేటలో పంచనామా చేయడం జరిగిందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌తో విచారణ జరిపి తప్పుడు పంచనామా రిపోర్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న గిరిజన రైతుల పేరున సాగు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ మెంబర్ అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు సాపిరెడ్డి నారాయణ మూర్తి, మండల కార్యదర్శి రాజుబాబు, బాలరాజు, రాజుబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంగళవారం అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆర్ జయ ప్రకాష్ సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులను సందర్శించారు. విద్యార్థులు పరీక్ష రాస్తుండగా పరిశీలన చేసారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి అత్యుత్తమ ఫలితాలు రాబట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రత్యేక అధికారి షేక్ షాలీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఏపీసి జయప్రకాష్

'భార్గవి'లో పగిలిన అమోనియా గ్యాస్ లిక్విడ్ డ్రమ్ము

- గ్యాస్ లీక్ కావడంతో భయాందోళన చెందిన ప్రజలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- సమగ్ర విచారణ చేయాలని సిఐటియు, ఇతర నేతల డిమాండ్

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ బోనంగి ఐడియల్ పార్క్‌లో ఉన్న భార్గవి అమోనియా కంపెనీలో అమోనియా గ్యాస్ లిక్విడ్ డ్రమ్ము పగలడంతో గ్యాస్ లీకైంది. దీంతో సమీప గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. ముఖ్యంగా బొద్దపు వానిపాలెం గ్రామంలో ప్రజలు దుర్వాసనతో ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ సూర్యకళ, సిఐ ఆర్.మల్లికార్జునరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పి.పరమేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనా స్థలాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, స్థానిక నాయకులు చందక కృష్ణ, ఇరోటి రమేష్, బొద్దపు శ్రీనివాసరావు, బొద్దపు చిన్నారావు తదితరులు పరిశీలించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ వెంటనే సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ఈ కంపెనీని తక్షణం ఇక్కడి నుంచి తరలించాలని కోరారు. ఈ సంఘటనపై స్థానికులు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం రాత్రివేళల్లో తరచూ గ్యాస్ విడుదల చేస్తుందని, కిటికీలు మూసుకున్నా గ్యాస్ వాసన తగ్గడం లేదని తెలిపారు. ఈ గ్యాస్ వల్ల కళ్లు మంటలు, ఊపిరి ఆడకపోవడం, గొంతు నొప్పులు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐటియు నేత గనిశెట్టి తదితరులు

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరం నుండి వెంకటాపురం గ్రామం వరకు ఐదు కిలోమీటర్లు మేరకు సుమారు 70 ట్రాక్టర్లతో టిడిపి మండల అధ్యక్షులు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతాంగానికి తెలియచేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రైతు పడే కష్టాన్ని చూసిన కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉండేందుకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుండి సుమారు రూ.200 కోట్ల ఖర్చుపెట్టి మహిళకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉప్పరపల్లి నుండి బంగారమ్మపాలెం కలువ వరకు వేసిన రోడ్డును ప్రారంభించారు. వెంటపురం గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబు, మాజీ ఎంపీపీ మేజర్ల వినోద్ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ, ఎంపీపీ గోవిందరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు వెంకటపతి రాజు, నియోజకవర్గ నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి వంగలపూడి అనిత